## క్లుప్తంగా

### చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



మానవపాడు: మండలంలోని బోరవెల్లి గ్రామంలో శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయానికి దారి ఏర్పాటు చేయాలి



ఉండవెల్లి: గ్రామదేవత ఈదమ్మ ఆలయానికి దారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయానికి వచ్చే దారిని కొందరు వ్యక్తులు వాహనాలను నిలిపి దారి లేకుండా చేస్తున్నారన్నారు. అదే విధంగా పంచాయతీ కార్యదర్శి బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



కేటీదొడ్డి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని కేటీదొడ్డి, నందిన్నె పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. బడిబాటపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులను పనులకు తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సభ ఏర్పాట్ల పరిశీలన

గద్వాల: జిల్లా కేంద్రంలో తేరు మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభా ఏర్పాట్లను శుక్రవారం అఖిల పక్ష కమిటీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న ఆవాజ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జబ్బార్, అతికూర్ రెహమాన్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్‌బాబు పాల్గొన్నారు.

### విద్యాభివృద్ధికి కృషి చేయాలి



మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రామస్తులు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ అన్నారు. మండలంలోని శేషంపల్లి మూతబడిన పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ఉపాధ్యాయులు మెరుగైన విద్యను బోధించాలని పేర్కొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసేందుకు చేపట్టిన మరమ్మతులో భాగంగా శనివారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు అయిజ, వడ్డెపల్లి, రాజోళి మండలాల్లోని వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ నరేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం, మండల పరిధిలోని కిష్టాపురం, కురవపల్లి, యాపదిన్నె, గుడిదొడ్డి, ఉప్పల క్యాంపు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా వడ్డెపల్లి మండలంలోని తనగల, రాజోళి మండలంలోని పచ్చర్ల, మాందొడ్డి, పెద్దధన్వాడ, చిన్నధన్వాడ, నసనూరు గ్రామాల్లో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# గుంతల రోడ్లు.. నానా అవస్థలు

- రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



గుంతలమయంగా బిజ్వారం- గద్వాల రహదారి

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదభరితంగా మారాయి. గుంతలమయమైన రోడ్లతో నానా అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రోడ్లపై కంకర తేలి వాహనాలు అదుపతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం మరమ్మతు చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అదుపు తప్పుతున్న వాహనాలు**

బిజ్వారం నుంచి గద్వాల, మల్దకల్ నుంచి గట్టు, తాటికుంట స్టేజీ నుంచి తప్పెట్లమొర్సు, మల్దకల్ నుంచి ఎల్కూర్, మల్లెందొడ్డి నుంచి విఠలాపురం గ్రామాల రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మృత్యువాత పడిన సందర్భాలు కూడా ఉన్నాయని పేర్కొంటున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో



మరమ్మతుకు నోచుకోని ఎల్కూర్- మల్దకల్ రహదారి

రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిల్వ ఉండి ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మరమ్మతు కరువు**

ధ్వంసమైన గ్రామీణ రోడ్లకు కనీసం మరమ్మతు చేయాలని ప్రజాప్రతినిధులను, ఆర్‌అండ్‌బీ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న రోడ్లకు మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

### గుంతలతో ప్రమాదాలు



బిజ్వారం నుంచి గద్వాలకు వెళ్లే రహదారిలో మోకాటి లోతు గుంతలు ఏర్పడ్డాయి. 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బీటీ రహదారికి మరమ్మతు చేపట్టకపోవడంతో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గోవిందు, బిజ్వారం

### మరమ్మతు చేయాలి



సద్దలోనిపల్లి– నేతువానిపల్లి రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగి వాహనదారులు మృతి చెందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి రోడ్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుకు వెంటనే మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

– వెంకటేష్, సద్దలోనిపల్లి

### సమస్యలను పరిష్కరిస్తాం



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రహదారులను పరిశీలించి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు చేపడుతాం.

– బషీర్, పంచాయతీరాజ్ ఏఈ

## మౌలిక వసతుల కల్పనలో విఫలం



మాట్లాడుతున్న కుర్వ పల్లయ్య

ధరూరు: గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కుర్వ పల్లయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మార్లబీడు గ్రామ శివారులోని బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాత్రూంలు, మరుగుదొడ్లు సరిపడినన్ని లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రుళ్లు బయటకు వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కనీసం డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు నిలబడి భోజనం చేయాల్సి వస్తోందన్నారు. 420 హామీల పంగనామాలు పెట్టిన దుర్మార్గమైన ప్రభుత్వమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా గురుకులాల్లో కనీస వసతులు కల్పించడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహదేవ్, యువరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రోత్సహిస్తేనే అభివృద్ధి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కలందర్‌బాష

గద్వాలటౌన్ : పోటీ ప్రపంచంలో విద్యార్థులను ప్రోత్సహించినప్పుడే అభివృద్ధిలో దూసుకెళ్తారని స్థానిక ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాష అన్నారు. జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో భాగంగా డిగ్రీ కళాశాల నుంచి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన జిజ్ఞాస ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైందని, హైదరాబాద్‌లోని కళాశాలల కమిషనరేట్ కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులు ప్రాజెక్టును వివరించారు. దీనిని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో విద్యార్థులను అభినందిస్తూ సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి చదువులో అత్యంత ప్రతిభ అవసరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యన్న, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ సిఫార్సులను అమలు చేయాలి



సభ్యత్వ నమోదులో తపస్ సభ్యులు

కేటీదొడ్డి: వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని జోగుళాంబ గద్వాల జిల్లా తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని చింతలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పెండింగులో ఉన్న డీఏ, అలవెన్స్‌ను విడుదల చేయాలని ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. సీపీఎస్, పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో కేటీదొడ్డి మండల అధ్యక్షుడు రాఘవ, ప్రధాన కార్యదర్శి గోపాల్, సభ్యులు నరేష్, నాగరాజు, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనాభా నియంత్రణను పాటించాలి



క్యాతూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గట్టులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

అలంపూర్/ఇటిక్యాల/అయిజ/మానవపాడు/ఉండవెల్లి/గట్టు: జనాభా నియంత్రణను ప్రతి ఒక్కరూ పాటించాలని మండల వైద్య అధికారి భరత్ అన్నారు. మండలంలో క్యాతూర్ గ్రామంలో పీహెచ్‌సీ అధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ర్యాలీ చేపట్టారు. జనాభా పెరుగుదల రేటు, సమస్యలు, వనరుల లభ్యత, పర్యావరణంపై ప్రభావం, కుటుంబ నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య విస్తరణ అధికారి సత్యనారాయణ, హెచ్‌ఎస్ ఉలిగమ్మ, ఏఎన్‌ఎంలు సువర్ణకుమారి, శ్యామలాదేవి, హైమావతి పాల్గొన్నారు.

✤ ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రాధిక ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు సిబ్బంది పాల్గొన్నారు.

✤ అయిజ పట్టణంలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రధాన రోడ్లపై ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు.

✤ మానవపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ హేమమానస, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

✤ ఉండవెల్లి మండలంలోని పుల్లూరు, తక్కశీలలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, నర్సమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

✤ గట్టు మండల కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌ఐపై హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

మల్దకల్: మండలంలోని పావనంపల్లి గ్రామానికి చెందిన తిమ్మప్పను మల్దకల్ ఎస్‌ఐ నందికర్ పొలం తగాదా విషయంలో గత శనివారం పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచక్షణారహితంగా కొట్టాడని బాధితుడు జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా శుక్రవారం హైదరాబాద్‌లో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తిమ్మప్ప తెలిపారు. సివిల్ పంచాయతీల్లో ఎస్‌ఐ జోక్యంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

### వివరాలు ఈ-పాస్‌లో నమోదు చేయాలి



గట్టు: ఎరువుల దుకాణాల్లో విక్రయ వివరాలు ఈ- పాస్ మిషన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా రశీదులు అందజేయాలని సూచించారు. రైతులు పంటల కాలం పూర్తయ్యే వరకు రశీదులను భద్రపరచుకోవాలన్నారు. ఎరువుల ధరలను, స్టాకు వివరాలను దుకాణాల బయట సూచిక బోర్డుపై ప్రదర్శించాలని పేర్కొన్నారు.

### 'మహాగర్జన'ను విజయవంతం చేయాలి



ఇటిక్యాల: దివ్యాంగుల మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యకర్త పోగుల రాజేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా విజయ్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్యామ్, ధర్మతేజ్, రాకేష్, సురేష్, రోహిత్, రాజు, అయ్యన్న, సందీప్, దానేష్ తదితరులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

అయిజ: భారత్‌మాలా రోడ్డు నిర్మాణం చేపడుతున్న ఓ కంపెనీ యాజమాన్యం పాఠశాల నిర్మిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బింగుదొడ్డిలో నిలిచిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. తక్షణమే పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, ప్రదీప్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, లక్ష్మన్న, భీమన్న పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి



అలంపూర్‌లో నిల్వ నీటిని తొలగిస్తున్న ఆశా వర్కర్లు



అయిజలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ సైదులు

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో లోపించిన పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి కోరారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 8వ వార్డును మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను తెలియజేశారు. చెత్తాచెదారం పేరుకపోవడం, కంప చెట్లు ఏపుగా పెరుగడం, మురుగు కాల్వలు సరిగా లేకపోవడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నట్లు తెలిపారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు వాపోయారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రాజశేఖర్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రత పాటించాలి**

అలంపూర్: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల వైద్య అధికారి భరత్ అన్నారు. మండలంలోని ర్యాలంపాడు, భీమవరం, బైరన్‌పల్లి, కాశీపురం తదితర గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామాల్లో పర్యటించారు. దోమలు వృద్ధి చెందకుండా లార్వాల నిర్మూలన చేపట్టినట్లు తెలిపారు. నివాస గృహాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు కృషి



రాజోళిలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

రాజోళి: బాలల హక్కులను పరిరక్షించేందుకు ఎంవీ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కమిటీల సమావేశం శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో పాఠశాల యాజమాన్య కమిటీ, సీఆర్‌పీఎఫ్ కమిటీ, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లల హాజరు శాతం పెంపుదల, మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల పనితీరు, నాణ్యమైన మధ్యాహ్న భోజనంలో తదిదర అంశాలపై రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు, బాల కార్మికులపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్, సుధాకర్ పాల్గొన్నారు.

**బాలల సంరక్షణపై అవగాహన**

ఇటిక్యాల: మండల పరిధిలోని చాగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ శివలీల ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల లైంగిక వేధింపుల చట్టం- 2012, డయల్ 100, 1098 సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాంతయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరమేశ్వరి, పద్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం**

ఎర్రవల్లి: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్, జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు జాతీయ రహదారి, పొగాకు కంపెనీ స్టేజీలో దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లను సిబ్బందితో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ బైక్ మెకానిక్ షాపులో పనిచేస్తున్న ఇద్దరు మైనర్లను గుర్తించారు. అనంతరం షాపు యజమానిపై కేసును నమోదు చేసి వారిని మైనర్లను చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నరేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న హనుమంతునాయుడు

మల్దకల్: త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ సత్తా చాటుతుందని గద్వాల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బాసు హనుమంతునాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతులకు సాగు పెట్టుబడి కోసం రైతుబంధు, రైతుబీమాతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు పటేల్ జనార్ధన్‌రెడ్డి, బాసుశ్యామల, రాఘవేంద్రరెడ్డి, రాజారెడ్డి, చక్రధర్‌రావు, శేఖర్‌నాయుడు, శ్రీనివాస్‌గౌడ్, మోనేష్, రాజు, సోమశేఖర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## హాజరు శాతం పెంచేందుకు కసరత్తు



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

గద్వాల(ధరూరు): ప్రభుత్వ పాఠశాలల్లో నూతన టెక్నాలజీని ఉపయోగించి హాజరు వాతాన్ని పెంచేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోందని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతిరోజు పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థుల హాజరును ఇక నుంచి ముఖ గుర్తింపు ద్వారా నమోదు చేస్తారన్నారు. అందుకుగాను మొదటి సారిగా విద్యార్థుల, ఉపాధ్యాయుల ముఖాలను క్లియర్‌గా ఫోటోతీసి ఆన్‌లైన్‌లో పొందు పరచడం ద్వారా తిరిగి హాజరు కోసం ఫోటో తీసుకునే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఆయా పాఠశాలల పాధ్యాయులకు ఉన్న సందేహాలను టెక్నికల్ అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శివకృష్ణ, సీఆర్పీ నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల పెంపు హర్షణీయం



నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఎర్రవల్లి: బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంటకేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో రిజర్వేషన్ల పెంపు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ నాయకుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబు, ఈదన్న, కృష్ణ, దుబ్బన్న, దేవన్న, బూపాలం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ముళ్లపొదలు తొలగించండి సారూ..

రాజోళి: శాంతినగర్ పట్టణంలో పలు కాలనీల్లో విచ్చలవిడిగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో ముళ్లపొదలు ఏపుగా పెరిగి విషసర్పాలు, దోమల బెడదతో అల్లాడుతున్నట్లు వాపోతున్నారు. అదే విధంగా పందుల సచారం కూడా ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. కోవెలదిన్నె రోడ్డు, కృష్ణచైతన్య పాఠశాల తదిదర చోట్ల ముళ్ల కంపలు తొలగించాలని కోరారు.

### భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో రాత్రి అమ్మవారికి కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.